చెరుకును ఆశిస్తున్న తెగుళ్లు

- నివారిస్తేనే అధిక దిగుబడి
- అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి


మల్లాపూర్‌లో సాగు చేస్తున్న చెరుకు పంట

మల్లాపూర్: చెరుకు పంట సాగులో ఆశించే పురుగులను, తెగుళ్లను గుర్తించి నివారించకపోతే చెరుకు పంట దిగుబడి గణనీయంగా తగ్గుతుందని వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు. ఆరుగాలం కష్టించి పండించే రైతుకు దిగుబడి నష్టం రాకుండా ఉండాలంటే పురుగులు, తెగుళ్లు సోకకుండా నివారణకు అధిక ప్రాముఖ్యతను ఇవ్వాలి.

చెరుకు పంటకు ఆశించే పురుగులు

పోలుసు పురుగు : కణువు ఏర్పడినప్పటి నుంచి, చెరుకు నరికే వరకు పొలుసు పురుగు పైరునాశిస్తుంది. నీటి ఎద్దడి పరిస్థితుల్లో ఎక్కువ నష్టం కల్గిస్తుంది.

నివారణ : విత్తనపు దవ్వను పొలుసు పురుగు ఆశించని తోటల నుంచి సేకరించాలి. లేదా మూడు కళ్ల ముచ్చెలను మలాథియాన్ 2.0 మి.లీ. లేక డైమిథోయేట్ 1.7మి.లీ. లీటర్ నీటి మోతాదులో కలిపిన ద్రావణంలో 15 నిముషాలు ముంచి నాటాలి. పొలుసు పురుగు వ్యాప్తిని అరికట్టడానికి ఆకులు రెలచి(మొవ్వులో కనీసం 8 ఆకులు ఉంచి) డైమిథోయేట్ 1.7మి.లీ. లేక మలాథియాన్ 3. మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి.

చెరుకు పంటకు ఆశించే తెగుళ్లు

గడ్డిదుబ్బు తెగుళ్లు : తెగులు ఆశించిన మొక్కల మొదళ్ల నుంచి సన్నని తెల్లని పిలకలు ఎక్కువగా వస్తాయి. ఆకులు పాలిపోయి చాల చిన్నవిగా ఉండి, మొక్కలు గడ్డిదుబ్బుల వలే ఉంటాయి. కార్శి తోటల్లో ఎక్కువగా కనబడుతాయి.

నివారణ : తెగులు సోకిన మొక్క తోటల నుండి కార్శి చేయరాదు. తెగులు సోకిన దుబ్బులను తవ్వి తగులబెట్టాలి. విత్తనపు ముచ్చెలను వేడినీటిలో గాని, తేమతో మిళితమైన వేడిగాలిలో గాని శుద్ధి చేయాలి. తెగులు వ్యాప్తి చేసే కీటకాలను నివారించడానికి మలాథియాన్ లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. పోలంలో కలుపు లేకుండా చూసుకోవాలి. తెగుళ్లను తట్టుకునే రకాలను సాగు చేయాలి.

తెగుళ్లు, పురుగులు సోకకుండా చూడాలి..



చెరుకు పంట సాగులో రైతుకు దిగుబడి నష్టం రాకుండా ఉండాలంటే పురుగులు, తెగుళ్లు సోకకుండా నివారణకు అధిక ప్రాధాన్యతనివ్వాలి. పొలుసు పురుగు, గడ్డిదుబ్బు తెగుళ్లు ఆశించినపుడు నివారణకు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

– లావణ్య, మండల ఏవో,మల్లాపూర్



కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్తులు తెలిపారు. కోతులు ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలు, వస్తువులను ధ్వంసం చేస్తున్నాయన్నారు. పెంకుటిళ్లపై ఎక్కి పైకప్పుకు రంధ్రాలు చేస్తున్నాయని వాపోతున్నారు. రోడ్ల వెంబడి వెళ్లేవారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయన్నారు. అధికారులు చొరవ చూపి కోతుల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శంకర్, ఎంపీడీవో, కథలాపూర్ సెల్ నం.: 8919654618

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

క్లుప్తంగా

మున్సిపల్ భవన పనులు వేగవంతం చేయాలి


పనులు పరిశీలిస్తున్న చైర్మన్ హన్మాండ్లు

రాయికల్: పట్టణంలో నిర్మిస్తున్న మున్సిపల్ నూతన భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు కోరారు. ఆదివారం పట్టణంలో మున్సిపల్ నూతన నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. భవన నిర్మాణ పనులు సకాలంలో పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ మహేందర్ బాబు తదితరులు ఉన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం


సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

మేడిపల్లి: నూతనంగా ఎన్నికైన మేడిపల్లి మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ యాదవ్‌ను జిల్లా యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాయికల్ పట్టణంలో సన్మానించారు. తనమీద నమ్మకంతో మార్కెట్ కమిటీ చెర్మన్ అవకాశం కల్పించిన వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. సహకరించిన జిల్లా యాదవ సంఘం పెద్దలకు ధన్యవాదాలు తెలిపాడు. కార్యక్రమంలో గణవేని మల్లేశ్ యాదవ్, బీనవేని ముఖేశ్ యాదవ్, రెబ్బస్ మల్లయ్య యాదవ్, అలాగే జిల్లా, మండల యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మార్కెట్ డైరెక్టర్‌కు..


రాజారెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన వాకిటి రాజారెడ్డి వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్‌గా నియమితులు కాగా, గ్రామస్తులు ఆదివారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సంబరాలు జరిపి, అనంతరం రాజారెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కూన సులోచన, కాంగ్రెస్ నాయకులు కూన అశోక్, గోపిడి మధు, తలారి మోహన్, తిరుపతిరెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలి


మాట్లాడుతున్న నాయకులు

మెట్‌పల్లిరూరల్: విశ్వబ్రాహ్మణులకు రాజకీయంగా అవకాశాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మెట్‌పల్లి మండల ఉపాధ్యక్షుడు ఇల్లెందుల రాజు అన్నారు. నామినేటెడ్ పదవుల్లో విశ్వబ్రాహ్మణులకు స్థానం కల్పించాలని కోరుతూ ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి,పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఫ్యాక్స్ ద్వారా లేఖ పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు భూమాచారి,చైతన్య,లక్ష్మణ్,సతీశ్,సురేష్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుస్తులు కిరాణ సామగ్రి పంపిణీ

జగిత్యాల రూరల్: జగిత్యాల సత్యసాయి అభయహస్తం నిర్వాహకులు ఆదివారం వివిధ గ్రామాలకు చెందిన నిరుపేద కుటుంబాలకు కిరాణ సామగ్రి, దుస్తులు పంపిణీ చేశారు. కార్తీక మాసం సందర్భంగా తాటిపల్లిలో వన భోజనాలను ఏర్పాటు చేశారు. అనంతరం నిరుపేదలకు దుస్తులతో పాటు, ఒక నెలకు సరిపడా కిరాణం సామగ్రిని అందజేశారు.

నిరుపేద కుటుంబానికి..

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేటలో ఆదివారం మేర మహేశ్ అనే నిరుపేద కుటుంబానికి ఆటో, జీప్, టాటా మ్యాజిక్ యూనియన్ అధ్యక్షుడు గుగ్లావత్ శివలాల్ నాయక్,ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు రంగు సంపత్‌గౌడ్, వెంకటరమణ, సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీపై ప్రజల్లో నమ్మకం పెరిగింది


సమావేశంలో మాట్లాడుతున్న భోగ శ్రావణి

సారంగాపూర్: మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం ద్వారా ప్రజల్లో మోదీ నాయకత్వంపై ప్రజల్లో మరింత నమ్మకం పెరిగిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణి అన్నారు. ఆదివారం సారంగాపూర్ మండల ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రధాన మోదీపై దేశంలో మరింత నమ్మకం పెరిగిందని, దీనికి తాజా ఉదాహరణే మహారాష్ట్ర ఎన్నికలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించే దిశగా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు గంగన్న, బీజేవైఎం మండలశాఖ అధ్యక్షుడు దీటి వెంకటేశ్, మండల ఉపాధ్యక్షుడు నరేశ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దెల గంగరాజం, దూలూరి వంశీ, వురుమల్ల నగేశ్ రెడ్డి, మండల పదాధికారులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో బీజేపీ సంబరాలు

మల్లాపూర్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ఘన విజయం సాధించడంతో బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు నిర్వహించుకున్నారు. బాణసంచా కాల్చి నినాదాలు చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల ఆశీస్సులతో రాబోయే 2029 ఎన్నికల్లో బీజేపీ పార్టీ అత్యాధిక సీట్లు గెలుపొంది అధికారం చేపట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర లక్ష్మీ, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం నర్సిరెడ్డి, ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్, మహిళా మోర్చా అధ్యక్షురాలు శాంతక్క, పట్టణ అధ్యక్షుడు ముష్కరి రాజ్‌కుమార్, బూత్ అధ్యక్షుడు ఇల్లెందుల మనోజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లిలో..

పెగడపల్లి: మహారాష్ట్రలో ఎన్డీఏ కూటమి విజయంపై ఆదివారం బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి వద్ద టపాసులు పేల్చి సంబరాలు జరిపారు. రానున్న రోజుల్లో తెలంగాణాలో బీజేపీ అనూహ్య విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంగుల కొమురెల్లి, పల్లె మోహన్‌రెడ్డి, కొత్తూరి బాబు, అంజి, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఝార్ఖండ్‌లో విజయం సాధించడంపై సంబరాలు నిర్వహించారు. దీనితో అప్పటికే అంబేడ్కర్ విగ్రహంలోని చేతు ధ్వంసమై ఉండడంతో, కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఈ విషయాన్ని చూపించారు. దీనిపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డీఎస్పీ రఘుచందర్‌కు ఫోన్‌చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. విషయం తెలుసుకున్న దళిత సంఘ నాయకలు విగ్రహం వద్ద ఆందోళన చేయడంతో పాటు, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా జగిత్యాల మున్సిపల్ శానిటరీ అధికారి మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై కిరణ్ తెలిపారు.

సంస్కృతి పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర గొప్పది


మాట్లాడుతున్న కాచం రమేశ్

జగిత్యాలజోన్: భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించడంలో న్యాయవాదుల పాత్ర ఎనలేనిదని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అడ్వకేట్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య కాలం నుండి నేటి వరకు దేశ అభివృద్ధిలో న్యాయవాదుల పాత్ర కీలకమైనదన్నారు. బ్రిటిష్ కాలంలో ఏర్పడ్డ చట్టాలను, ఇప్పుడిప్పుడే మార్చి మన సంస్కృతితో కూడిన చట్టాలు వస్తుండటం అభినందనీయమన్నారు. హిందుత్వం అంటే మతం కాదని హిందుత్వం అంటే సమాజ జీవన విధానమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డబ్బు లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి భూమి రమణకుమార్, ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ్ చాలక్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, నగర సంఘ చాలక్ జిడిగే పురుషోత్తం, న్యాయవాదులు పాల్గొన్నారు.

'సహారా' బాధితులకు డబ్బులు చెల్లించాలి


సమావేశమైన సహారా ఇండియా బాధితులు

కోరుట్ల: సహారా ఇండియా బాధితులకు డబ్బులు చెల్లించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పూజిత అన్నారు. పట్టణంలోని సాయిబాబా ఆలయ ఆవరణలో బాధితుల సంఘం సమావేశమైంది. దేశంలో 13కోట్ల మంది సహారా బాధితులు ఉన్నారని వారందరికీ రూ.80లక్షల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని మోదీ, మంత్రి అమిత్‌షా ప్రతి ఖాతాదారుడికి నయాపైసాతో సహా చెల్లిస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కారని తెలిపారు. ప్రభుత్వ డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బాలయ్య, జిల్లా అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి రాజేశ్వరి, గణేశ్, నరేశ్ పాల్గొన్నారు.

కార్తీక వన భోజనాలు



జగిత్యాలరూరల్: జగిత్యాల హౌసింగ్‌బోర్డులోని శ్రీ గణేశ్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని శ్రీ పొలస్తేశ్వర స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, గోపూజ, దీప దానాలు నిర్వహించారు. అనంతరం ఆలయం కార్తీకమాసం సామూహిక వనభోజనలు చేశారు. కార్యక్రమంలో ఈవో రవికిషన్, అర్చకులు గోవర్ధన శర్మ, గోపాల్ శర్మ, మహేశ్ శర్మ, హౌసింగ్ బోర్డు కాలనీవాసులు పాల్గొన్నారు.



మల్లాపూర్: కార్తీకమాసం సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వాల్గొండ శ్రీ రామలింగేశ్వర ఆలయంలో ఆదివారం కార్తీకమాస పూజలు, వనభోజనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనందరావు, ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గురగుబెల్లి నర్సింగరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కృష్ణ, రాష్ట్ర బాధ్యుల, మండల అధ్యక్షుడు ఎనగందుల శ్రీనివాస్, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు మరో అవకాశం

పెగడపల్లి: ఎమ్మెల్సీ ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని తహసీల్దార్ రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో ఇప్పటి వరకు 1600 మంది ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకున్నారని ఆయన తెలిపారు. ఓటరు నమోదు చేసుకోని వారి కోసం డిగ్రీ పూర్తి చేసిన, ఉపాధ్యాయులుగా కొనసాగుతున్న అర్హతగల వారు డిసెంబర్ 9వ తేదీ వరకు ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చన్నారు. కొత్తగా నమోదు చేసుకోవడమే కాకుండా ప్రకటించిన ముసాయిదాలో పొరపాట్లు, తప్పులు చోటుచేసుకున్న అభ్యంతరాలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

మల్లన్నపేటలో ఉచిత వైద్య శిబిరం

వెల్గటూర్ : ఐఎంఏ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో గొల్లపల్లి మండలం మల్లన్నపేటలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 277 మంది గ్రామస్తులు వైద్య సేవలు అందుకున్నారు. ఐఎంఏ అధ్యక్షుడు గూడూరి హేమంత్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్లు మృదుల, రాజశేఖర్, సుధీర్, ప్రశాంత్‌లు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్ నాయకులు పాల్గొన్నారు.

కుక్క పిల్లలకు బారసాల



మెట్‌పల్లి: పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన రాపెల్లి వినోద్–లావణ్య దంపతులు షీజూ జాతికి చెందిన కుక్కను పెంచుకుంటున్నారు. దానికి డైసీ అని పేరు పెట్టారు. అయితే కొన్ని రోజుల క్రితం అది నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. వాటిని చూసి ఎంతో మురిసిపోయిన ఆ దంపతులు వాటికి శనివారం రాత్రి నామకరణోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు వచ్చిన వారికి విందు భోజనం ఏర్పాటు చేశారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి


వైద్య శిబిరం ప్రారంభిస్తున్న నర్సింగరావు

కోరుట్ల: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని 15 వ వార్డు బీముని దుబ్బలో స్థానిక కౌన్సిలర్ ఆడెపు కమలా మదు సౌజన్యంతో కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నర్సింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా 300 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించగా 200 మందికి బీపీ షుగర్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలీ యువత ఆధ్వర్యంలో..

పద్మశాలీ యువత ఆధ్వర్యంలో మమత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి నీలం శ్రీనివాస్, వైద్యులు, యువత అధ్యక్షుడు జక్కుల ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

• బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగు గ్రామానికి చెందిన వికలాంగుడు మ్యాకల ఆశన్న ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబానికి టీవీఎస్‌వీ జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గనవేణి మల్లేశ్ యాదవ్ ఆధ్వర్యంలో రూ.85 వేల ఆర్థికసాయం ఆదివారం అందించారు. కార్యక్రమంలో యాదవ సంఘ నాయకులు రవి యాదవ్, ముక్కెర చంద్రశేఖర్ యాదవ్, దేవయ్య యాదవ్, డబ్బల మల్లేశ్ యాదవ్, చిన్నయ్య, శంకర్, వినోద్, పాల్గొన్నారు.

• ఆర్ఎంపీ,పీఎంపీల నూతన కార్యవర్గం

మల్యాల: మండల ఆర్ఎంపీ,పీఎంపీల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెంట సుధాకర్, ప్రధాన కార్యదర్శి నక్క మధుకర్, కోశాధికారి ఇజ్జగిరి గంగాధర్, గౌరవ అధ్యక్షులుగా కొండా జనార్దన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఐలేని రాజేశ్వర్‌రావు, కంది చంద్రశేఖర్ రావు, కుసుమ శంకర్, సందుపట్ల రాజేశం, కోల మహేందర్, ఆకుల నాగరాజు, బండారి అశోక్, కట్కం శ్రీనివాస్, విశ్వం, గాజుల గోవర్ధన్, గూడ లక్ష్మీనారాయణ, భూపతి, రమేశ్ పాల్గొన్నారు.

• మాలల సింహగర్జన సభ పోస్టర్ ఆవిష్కరణ

సారంగాపూర్: ఎస్సీ వర్గీకరణ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 1న సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగే మాలల సింహగర్జన సభకు ప్రతి మాల పౌరుడు తరలిరావాలని మాల సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం సారంగాపూర్‌లో మాలల సింహగర్జన బహిరంగ సభ పోస్టర్‌ను జగిత్యాల జేఏసీ కన్వీనర్ నకుమల్ల లక్ష్మీనారయణ, జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్, జగిత్యాల టౌన్ అధ్యక్షుడు కరంగుల వసంతరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

• రేపు అల్లీపూర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో ఈ నెల 26న జగిత్యాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం నిర్వాహకుడు తంగెళ్ల రమేశ్ ఆదివారం తెలిపారు. పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అయ్యప్ప స్వాముల మాలధారణ

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లికి చెందిన 20 మందిభక్తులు ఆదివారం గురుస్వామి చౌదాల వినోద్ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ స్వీకరించారు. కార్యక్రమంలో గురుస్వాములు బట్టు రవి, నారాయణ, రాంరెడ్డి, సుధాకర్, గంగారెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్, సంతోష్ పాల్గొన్నారు.

ఎస్సైకి పాస్టర్ల వినతి

రాయికల్: క్రిస్మస్,నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గ్రామాల్లో, పట్టణంలో క్యారల్స్ నిర్వహించు సమయంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పాస్టర్లు కోరారు. ఆదివారం పాస్టర్లు ప్రసాద్,అశోక్,సంతోష్,రూబేర్ ఎస్సై సుధీర్ రావుకు వినతి పత్రం ఇచ్చారు.

పోచమ్మ ఉత్సవాల్లో 'అడ్లూరి'


పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్: గొల్లపల్లి మండలం వెనుగుమట్లలో ఆదివారం నిర్వహించిన పోచమ్మ బోనాల ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఆ పోచమ్మ తల్లి నియోజకవర్గ ప్రజలందరినీ చల్లగా చూడాలని కోరుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.